కథా నిలయం
3610
శ్రీకాకుళం

# గడ్డితినే గాడిదలు

'ఇదే సార్, మీబెర్త్. ముందు అర్జంటుగా నన్ను పంపించేసి ఆ తరవాత బెడ్డింగ్ పరిచెయ్యండి,' రైల్వే జనరల్ మేనేజర్‌కూడా అంతలధారిటీతో ఆ మాటల్ని అనలేడు. జనరల్ కంపార్టుమెంట్‌లో సామాను పెట్టుకోటానికి ఉద్దేశించిన పైబల్ల అది. అది తన సొంతం అయినట్లు నాకు ఇచ్చేశాడా నల్లబట్టల యువకుడు.

అతడిని అక్కడికక్కడ పంపించి వేయటానికి నాకు బిడియమేసింది. నా బెర్త్‌క్రింద సీట్లలో కొందరు ప్యాసెంజర్స్ ఉన్నారు. వారు నన్నూ, ఆవ్యక్తినీ అప్పటికే కుతూహలంగా చూడటం గమనించాను.

కాస్త అవతలకి నడిచి ఎవరూలేకుండా చూచి జేబులోనుంచి రెండు పదులు తీసి అతని చేతిలో ఉంచాను. అతను నన్ను చూచి ఎగతాళిగా నవ్వాడు.

'ఇందుకా అక్కడినుంచి ఇక్కడికి తీసుకొచ్చారు? సార్! ఇందులో దాపరికం ఏం లేదండీ. అంతా పబ్లిక్కు 'అంటూ నోట్లు జేబులో పెట్టుకుంటూ, "చీప్‌గా బెర్త్ కొట్టేశారు. అదృష్టవంతులు, విష్‌యూ గుడ్‌లక్' అంటూ నల్లబట్టల యువకుడు పెట్టె దిగిపోయాడు.

పెట్టె అంతా దాదాపు ఖాళీగానే ఉంది. బెర్త్‌లు మరీ ఖాళీగా ఉన్నాయి. కానీ కింది బల్లలమీద నల్ల గుడ్డ పేలికలూ, ఎర్ర గుడ్డ పేలికలూ చాలా ఉన్నాయి. బెర్త్‌కు ఒకటి చొప్పున నల్లటిదో, ఎర్రటిదో ఒక్క గుడ్డపేలిక వంతున ఉంది.

అఫిషియల్‌గానే బెర్త్ విలువ పది రూపాయలు. అనఫిషియల్ అండ్ ఇల్లీగల్ బెర్త్‌కు తొందరపడి ఇరవై రూపాయలిచ్చానేమో అనిపించింది. అంతలోనే నల్ల దుస్తుల యువకుడన్న మాటలు గుర్తుకొచ్చాయి.

'ఎర్రగుడ్డల వాళ్ళు ఇరవై రూపాయలు సీటుకే వసూలు చేస్తారు. సార్, మాకు అంత ఆశలేదు. మా గురువుల ఆజ్ఞ ఇది. అయినా ఇందులో ఎన్నెన్ని వాటాలో.... ఎన్ని పంపకాలో మీకేం తెలుసు సార్? ఇంత కష్టపడ్డందుకు నాకు ఒక్క రూపాయికూడా మిగలదు.'

ఏమైనా నేను దూరం ప్రయాణం చేయాలి. ఎంత ప్రాధేయపడ్డా రిజర్వేషన్ కంపార్టుమెంట్ వాళ్ళలో ఒకరూ దయ చూపలేదు. ఆశ పెడితే లొంగారు. కానీబేరం దగ్గర చాలా భేదం వచ్చింది. వారు వంద మీద ఉన్నారు. అసలు ఛార్జీకన్నా బెర్త్‌ఛార్జీ ఇబ్బడికి ముబ్బడా?

ఎందుకైనా మంచిదని నేను త్వరగా నాబెర్త్ వద్ద కెళ్ళేను. పైకెక్కి బెడ్డింగ్ పరచబోతూ ఒక మూలనున్న ఎర్రపేలికను చూచాను.

నా గుండె గుభేలుమంది ఒక్క క్షణం.

అయినా బెడ్డింగ్ పరిచేశాను. కిందికి దిగి కిటికీలో గుండా నాకు బెర్త్ అమ్మిన నల్ల చొక్కా వ్యక్తి

కనిపిస్తాడేమోనని వెతికాను. ఊఁహూఁ.

'బెర్త్‌ను ఎంతకు కొన్నారు?'' నా బెర్త్ కింద సీట్లలో కూర్చున్న వాళ్ళలో ఓ ఎర్రటి, లావుపాటి వ్యక్తి అడిగాడు.

నేను బెర్త్ కొన్నట్లు అయనెట్లా గ్రహించాడో?

క్రమంగా కంపార్టుమెంట్‌లో సీట్లు, బెర్తుల్లోకి మనుషులు రాసాగారు. నల్లబట్టల వ్యక్తుల్లో ఎర్రబట్టల వ్యక్తుల్లో ఎవరో ఒకరు పాసెంజర్స్‌కు సీట్లు చూపించి, అందుపైన పరచిన పేలికల్తోపాటు బేరం ప్రకారం డబ్బులు తీసుకెళ్తున్నారు. సీటుకు ఇరవై తక్కువ ఎవరూ ఇవ్వలేదు. బెర్త్‌కు నలభై నుంచి యాభైదాకా ఇచ్చారు.

'అంకుల్ చాలా చీప్‌గా బెర్త్ కొట్టేశాడు నాన్నా. ఇరవై రూపాయలే ఇచ్చాడు. నేను చూచానుగా?.' తండ్రి పోలికల్తో ఎర్రటి ఫుట్‌బాల్‌లా ఉన్న ఎనిమిదేళ్ళ కుర్రాడు పెద్దగా అరిచాడు.

జనరల్ కంపార్టుమెంట్‌లో బెర్త్ వెల ఇరవైరూపాయలు చాలా తక్కువ అని ఆ ఛోటా కుంకకు కూడా తెలిసిపోయింది. మరి నాకు అంత తక్కువకు ఎందుకు అమ్మిపోయినట్లు? ఎర్రపేలికల వాళ్ళు మళ్ళీ వచ్చి గొడవ చెయ్యరు కదా? అసలు సీటుకు వాళ్ళెంత ఇచ్చారో?

'అవును సార్. మీ అబ్బాయి చెప్పింది నిజమే. మీవాడు అఖండుడులాగా ఉన్నాడు. కానీ సీటుకు మీ రెంత ఇచ్చారు?''

'హహ్హహ్హా...' నవ్వు విని ఉలిక్కిపడ్డాను. వేమూరిగగ్గయ్యో. యస్వీ రంగారావో నవ్వినట్టుంది.

రైల్లో సీటుకు-ఆఫ్టరాల్ సీటుకు, నా తండ్రి, అనగా మదీయ ఫాదర్ డబ్బు నిచ్చుటయా? అవమాన మవమానము. నేనున్నూ, మదీయ ఫాదరున్నూ భీకర పోరాటం సల్పి ఈ సీట్లను కైవసం చేసుకొంటిమి. హహ్హహ్హా.'' ఎర్ర ఫుట్‌బాల్ నవ్వాడు.

ఒకవేళ ఏదైనా గొడవ వస్తే వీరు సాయంచేసేవారులా ఉన్నారు. ఆ ఫేమిలీని మంచి చేసుకోవటం ఎందుకైనా మంచిదనిపించింది. అందుకు వారితో కాస్త కబుర్లాడితే మంచిది కదా?.

వాళ్ళ పక్కన కూర్చోటానికి సీటు కోసం చూచాను. అప్పటికే అన్ని సీట్స్ ఫుల్, జనరల్ కంపార్టుమెంట్ కావటం చేత జనం వేగంగా పెరుగుతున్నారు.

'ఇక్కడ కూర్చోండి.' ఎర్రటి లావు మనిషి కాస్త జరిగి తన పక్కన నాకు చోటిచ్చాడు.

ఆయన కుటుంబ సభ్యులు మొత్తం అయిదుగురు. ఇరవై సంవత్సరాల ఆయన పెద్ద కూతురు ఆయన పక్కన విండో సీట్‌లో కూర్చున్నది. ఆమె కెదురుగా బల్లమీద విండోపక్క రెండో అమ్మాయి కాబోలు కూర్చుంది. ఆ అమ్మాయికి పదహారేళ్ళ వయస్సు. ఆ పిల్ల పక్కన తల్లి కూర్చుంది, తల్లి పక్కన ఫుట్‌బాల్ కూర్చున్నాడు.

'మీ రెంతవరకు వెళ్తున్నారు?' ఆయన్ని మాటల్లో దించటానికి ప్రశ్నించాను.

'బెజవాడ లేక బ్లేజ్‌వాడ మరియు విజయవాడ. ది గ్రేట్ ఆంధ్రా సిటీ మా స్వస్థలంబు, బావగారూ...

ఫుట్‌బాల్ గాడు అన్నాడు. అసలు వాడిధోరణే చాలా డ్రమెటిక్‌గా ఉంది. ప్రతిదీ కల్పించుకునే తత్వంలా ఉంది. దానికితోడు ఇప్పుడు ఏకంగా బావగారి వరసే కలిపేశాడు.

నేను భయం భయంగా ఆ పెద్దమనిషి కూతుళ్ళ వైపు చూశాను. పెద్దమ్మాయిది తండ్రిలా భారీ పర్సనాలిటీ, ఆ భారీతనం పళ్ళక్కూడా వచ్చింది. పళ్లు కోరల్లా పైకి పొడుచుకొచ్చాయి. కానీ కళ్ళు మాత్రం ఎక్కడో అగాధంలో ఉన్నట్లున్నాయి. ఈ దంతసుందరా నాభార్య? ప్రేయసి?

ఇక రెండో అమ్మాయి ఫర్వాలేదు. బాగానే ఉంది.

కానీ పదహారేళ్ళన్నా లేని ఆ పిల్ల నేనప్పుడే తన మొగుడినయినట్లు అలా మెలికలు తిరిగిపోతుందేం? ఆ సిగ్గు... ఆ చూపులు.... ఆ పమిట సర్దుకోవటం... ఆ పెదిమలు కొరుక్కోవటం.... అమ్మో! ఈ పిల్లను ఓ వేళ చేసుకున్నా కుదురుగా కాపరం చేస్తుందా?.

'మా అబ్బాయికి బంధుప్రీతి చాలా జాస్తిలెండి. వాడు మనుషుల్ని చూడగానే శత్రువో, మిత్రుడో పసిగట్టేస్తాడు. మిత్రులయితే బంధుత్వాన్ని కలిపేస్తాడు. అదేం చిత్రమో కానీ, వాడు బంధుత్వం కలిపితే అది అక్షరాలా నిజమయి తీరుతుం దనుకోండి. అందుకేనేమో 'బాలవాక్కు బ్రహ్మవాక్కు' అన్నారు.''

'బ్రహ్మవాక్కు. కాదు-బ్రహ్మరాక్షసి వాక్కు'' అనుకున్నాను మనసులో కసిగా.

ఆ కుర్రకుంకగాడి కిదంతా ఆ బోండాం పెద్ద మనిషి ఇచ్చిన ట్రెయినింగ్ అయ్యుండాలి. లేకపోతే మొదట్లో అంకుల్‌ని కాస్తా నిముషంలో బావగారిగా ఎలా మారేను? అమ్మో! ఇందులో ఏదో కుట్రవుంది.

'అవునవును' అంటూ పైకి నవ్వాను నేను.

ఆ తరవాత ఆ అయిదు సీట్లను ఎలా సంపాదించిందీ ఫుట్‌బాల్‌గాడు వర్ణించి చెప్పాడు.

ఆ సీట్ల కోసం వాళ్ళు బండికన్నా ముందే ప్లాట్‌ఫారమ్ మీది కొచ్చారు. బండి ఆగకముందే లావుమనిషి, ఫుట్‌బాల్ ఆ పెట్టెలో జొరబడ్డారు. అప్పటికే అక్కడ పేలికలు పర్చి ఉన్నాయి. వాటిని తీసి పారేసి అయిదు సీట్లను ఆక్రమించారు. బండి ఆగాక ఆ పేలికల తాలూకు మనుషులొచ్చి అవి తమ సీట్లని పోరాడారు. బెదిరించారు. కానీ తండ్రీ కొడుకు లిద్దరూ యుద్ధ ప్రియులు కదా? అవతల వారికి వినుగు పుట్టిందాకా అరిచి గోలచేసి వాళ్లపై విజయం సాధించారు.

ఆ కథ అయ్యాక బోండాం పెద్దమనిషి అసలు వ్యవహారం లోకి దిగాడు.

'నీకు పెళ్ళయిందా, బాబూ?'

నా గుండె గుభేలు గుభేలుమంది. డబుల్ గుండ్లు దిగబడ్డట్టయింది.

ఒకసారి గుభేలు ఆ ప్రశ్నకు- రెండోసారి గుభేలు ... అప్పుడే కంపార్టుమెంట్‌లో జనాన్ని తోసుకుని వస్తున్న ఓ ఎర్ర బట్టల యువకుడిని చూచి.

ఆ ఎర్రబట్టల యువకుడు నా బెర్త్ వద్దకొచ్చి ఆగాడు. అక్కడ అప్పటికే బెడ్డింగ్ పరిచి ఉంచటం

చూచి కనుబొమ్మలు ముడి వేశాడు .

'మీ బెర్త్ ఇదే, సార్' అంటూ తన వెనక వచ్చిన వ్యక్తికి నా బెర్త్ చూపిస్తూ అన్నాడు. ఆ తరవాత మావైపు తిరిగి 'ఈ బెర్త్ మీద బెడ్డింగ్ ఎవరిది, సార్? ఇది నేను రిజర్వు చేసిన బెర్త్. ఇదిగో ఆనవాలు' అంటూ నేను చివరికి జరిపిన ఎర్రపేలికను తీసి అందరికీ ప్రదర్శించాడు.

'ఆ బెర్త్ మా బావగారిది,' ఫుట్‌బాల్‌గాడు నా తరపున అన్నాడు.

'నాకు పెళ్ళికాలేదు సార్' అన్నాను నేను పెద్దమనిషి వైపు చూచి.

ఆయన, ఆయన భార్య కళ్ళల్లో బరువు తీరిపోయిన తృప్తి.

ఇద్దరు ఆడకూతుళ్ల కళ్ళలో....అబ్బో...అదేం వెలుగు? నన్ను దహించే ప్రేమాగ్ని.

కానీ ఫుట్‌బాల్‌గాడు ఇదేం పట్టించుకోలేదు.

'మాబావగారు ఆ బెర్త్‌ను ఇరవై రూపాయలిచ్చి కొన్నారు. మధ్యలో వచ్చి 'నా బెర్త్' అనటానికి నువ్వెవరివంట?'

'బచ్చా గాడివి-నువ్వేందిరా? ఆ బావను మాట్లాడమను. లేకపోతే బెడ్డింగ్ తీసిపారేస్తా.' ఎర్రబట్టల వ్యక్తి నిప్పులు కక్కుతూ అన్నాడు. అంటుండగానే ఫుట్‌బాల్ గాడు ఫుట్‌బాల్‌లా పైకెగిరి బెర్త్ మీద నా బెడ్డింగ్ పై పడుకున్నాడు. యుద్ధం అరంభమయింది.

★ ★ ★

యుద్ధం పది నిమిషాల పాటే జరిగినా మహా భీకరంగా సాగింది.

ఎర్రబోండాం, ఆయన భార్య నావైపు సేనాధి పతులై పోరాడారు. కంపార్టుమెంట్‌లో స్టాండింగ్ ప్యాసెంజర్స్‌తో సహా చాలా మంది నా పక్షాన సైనికులై పోరాడారు. నాకు అంత మద్దతు అసలు వచ్చి ఉండకపోను. కానీ ఎర్రబట్టల వ్యక్తి అరంభంలో చాలా దుడుకుగా ప్రవర్తించాడు. మాట తూలాడు. వాళ్ళు రిజర్వు చేసుకునే సీట్ల నాక్రమించే పాసెంజర్లందర్నీ మొత్తంగా కలిపి దుర్భాషలాడాడు, చెయ్యి జారాడు. నా బెడ్డింగ్ నాక్రమించిన ఫుట్‌బాల్ గాడిని బెడ్‌తో సహా కిందికి లాగిపారేయాలని ప్రయత్నించాడు. అడ్డం వచ్చిన వాళ్ళ పట్ల మూర్ఖంగా ప్రవర్తించాడు. దానితో అతనికి అంతా వ్యతిరేక మయ్యారు.

'ఈ బెర్త్‌ను నేను ట్రెయిన్ ఫామ్ కాకముందే రిజర్వు చేసుకున్నాను. నీ కమ్మిన ఆ దొంగనా.... ఇటు తీసుకురా. కత్తి పెట్టి పొడిచి చంపేస్తాను.' అంటూ లేచాడు.

'అసలు మీ కలా రిజర్వు చేసే హక్కు ఎవరిచ్చారు? జనరల్ కంపార్టుమెంట్‌లో సీట్లు కూడా మీరు ఆక్రమించి అమ్మకానికి పెడ్తే ఇక ప్రయాణీకులం మేం ఏమయిపోవాలి?" బోండాం వాదన అది.

'అసలు మనం కొంటుండబట్టే కదుటండీ వాళ్ళు అమ్మగలుగుతోంది?"

యుద్ధం పతాక స్థాయిలో ఉండగా బండి కదలబోతున్నట్లు అనౌన్స్‌మెంట్ అయింది. సిగ్నల్‌కూడా

ఇచ్చారు. ఇంజన్ కూతవేసిందికూడా.

'ఈయన నాబెర్త్ ఖాళీ చేస్తేనేకాని ఈ రైలు కదలదు. మావాళ్ళు కదలనివ్వరు. నేనా పెద్దమనిషికి బెర్త్ ఇస్తానని తీసుకొచ్చాను. ఇప్పుడు నేనాయనకేం చెప్పను? న్యాయముండాలండీ న్యాయం'' అన్నాడు ఎర్రబట్టల వ్యక్తి.

'మా అల్లుడు బెర్త్ ఖాళీ చేసే ప్రశ్నే లేదు.''

'ఒకవేళ మాబావగారు చేస్తానన్నా నేను మాత్రం బెర్త్ దిగను.'

ఫుట్‌బాల్‌గాడు మొండికేసుకుని పడుకున్నాడు.

ఎర్రబట్టల వ్యక్తి తాలూకు మనుషుల వల్ల కదల్లేదో, మరే కారణంచేతో తెలియదు కాని, కూతవేసి కూడా బండి కదల్లేదు.

'మాస్టారూ! అతనితో ఎందుకు అనవసరపు గొడవ? ఓ పది రూపాయలు అతని చేతిలో పెట్టండి.' ఎవరో రాజీమార్గంగా నాతో అన్నారు.

'ఊఁహూఁ నలభై రూపాయల నష్టం. లాభంలేదు.'

ఆఖరికి ఇరవై రూపాయలు నేను అతనికిచ్చేటట్లు, నేను ప్రస్తుతం కూర్చున్న సీటు అతను తీసుకొచ్చిన పెద్దమనిషికి ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది.

'మీరు ఈ వైపుకు రండి అల్లుడుగారూ. బుజ్జాయ్ మీ బెర్త్ మీద పడుకొన్నాడు గదా?' అత్తగారు అప్యాయంగా తన పక్కకు పిలిచింది. ఎర్రబోండాం పక్కన నేను ఖాళీ చేసిన సీటులో ఎర్రచొక్కా మనిషి తెచ్చిన వ్యక్తి కూర్చున్నాడు.

'బాబూ, నన్ను పంపించండి' ఎర్రబట్టల మనిషి ఆ వ్యక్తితో అన్నాడు ఆ వ్యక్తి అర్థం కానట్లు చూచాడు.

'బెర్త్‌కు బదులు సీటిప్పించాగా? పాతిక'

అతను మాట్లాడకుండా ఇరవై రూపాయలు తీసి అతని చేతిలో ఉంచాడు. ఎర్రచొక్కా వ్యక్తి దిగిపోయాడు.

ఇంజన్ భీకరంగా కూత వేసింది. రైలు మెల్లగా కదిలింది.

☆ ☆ ☆

'విజయవాడ' అన్న మాట వినిపించి మెలకువ వచ్చింది నాకు.

రైలు ఆగి ఉంది. సప్తరాగాల అపస్వరాలు ఒకేసారి వినిపిస్తున్నట్లుగా అమ్మే వారి అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ధ్వని....ధ్వని.

అమ్మయ్య! విజయవాడ స్టేషన్‌లో ఎర్రబోండాం, ఫుట్‌బాల్, దంతసుందరి, ప్రేమపిచ్చి అంతా

దిగిపోయి ఉంటారు. పీడా వదిలిపోయింది.

పక్కకు పోర్లి కళ్ళు విప్పి చూచాను. అంతా తమ తమ సీట్లలోనే ఉన్నారు. భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

ఇదేమిటి? విజయవాడలో దిగుతామన్నారుగా? స్టేషన్ వచ్చినా ఇంకా దిగరేం? కొంప కూల్చి పెళ్ళి విషయం మాట్లాడటానికి నాతో పాటు మా ఊరు వస్తారా ఏం?

రాత్రంతా వాళ్ళ గోల భరించలేక చచ్చాను. వంతుల వారీగా భార్యా భర్తలిద్దరూ తమ గొప్పలు చెప్పుకుంటూ నన్ను వాయించేశారు.

'పెళ్ళి చూపులివే అనుకో, అల్లుడూ. అవసరమయితే మీ వాళ్ళ కోసం మళ్ళీ ఏర్పాటు చేస్తామనుకో. అది పెద్దలకు సంబంధించిన విషయం. ఈ పెళ్ళిచూపులు నీకు ప్రత్యేకం. అమ్మాయిని చూచావుగా? లక్షణంగా సంసారపక్షంగా ఉంటుంది. నీకు నచ్చే ఉంటుంది. ఏమంటావ్?'

నేనేమనగలను? చూడబోతే ఆ పెద్దమనిషి పెళ్ళికూడా రైలు పెట్టెలోనే చేయించే సేలా ముందుకు దూసుకు పోతున్నాడు.

'కూర్చోపెట్టి అలా అడిగితే ఏం చెప్తాడండీ? ఎంత మగాడయితే మాత్రం? ఆ మొహంలో కన్పించటం లేదూ? అమ్మాయికి అబ్బాయీ, అబ్బాయికి అమ్మాయీ నచ్చారు. కాస్సేపు వాళ్ళిద్దర్నీ మాట్లాడుకోనీయండి. మీరిలా నాపక్కకు రండి. అబ్బాయి అమ్మాయి పక్కన కూర్చుంటాడు.'

'అవునోయ్-నువ్వన్నదీ నిజమే. ఈ కాలం పిల్లలు ఒకరి అభిరుచులు మరొకరు ముందే తెలుసుకోటం మంచిది కదూ?''

దంతసుందరి పక్క కూర్చోక తప్పలేదు నాకు. కూర్చున్నాక ఏం చేయాలో తోచలేదు. భార్యా భర్త లిద్దరూ కళ్ళుమూసుకొని నిద్రపోతున్నట్లు నటిస్తున్నారు.

'మాట్లాడరేం? మీ పేరేమిటి?'' సుందరే అడిగింది.

చెప్పాను. అసలే శరీరాలు రాసుకుంటున్నాయి. ఆమె మరింతగా నా వైపు జరిగింది.

'మరి మీ పేరు?''

'ఛీ! భార్యను మీరని పిలుస్తారేంటి? సుందరి-హేమసుందరి...

చచ్చాం. భార్యట! కోరల్తో పీక్కుతింటుందా ఏం?

'మీరు నాకు నచ్చారు. ఎందుకంటే, మీరు నా అభిమాన నటుడు అక్కినేని నాగేశ్వర్రావులా ఉన్నారు. పొట్టి అయితే నేం? ఎయన్నార్ గట్టివాడు. అవునూ? మీకు హీరోల్లో ఎవరంటే ఇష్టం?'

భార్యా భర్తలమయితే మా మొదటి రాత్రి ఎలా గడుస్తుందనే దానికి మచ్చు.

'పోనీ హీరోయిన్లలో ఎవరిష్టం? నేను శ్రీదేవిలా ఉంటానా? జయప్రదలా ఉంటానా? మా ఫ్రండ్సంతా నన్ను జయప్రదలా ఉంటానంటారు.'

అలా కాస్సేపు తోచింది. ఆ తరవాత అలిసి పోయినట్లు ఆవలించసాగింది. నేను లేచి ఫుట్‌బాల్‌గాడిని తట్టి లేపాను.

'ఉండు, బావా, నన్ను కాస్సేపు నిద్రపోనీ. మీరు 'లవ్వాడు' కోండి.'

ఇంక మొహమాట పడి లాభం లేదు. అప్పటికే చాలా రాత్రయింది. నలభై రూపాయలిచ్చి నేను బెర్త్ కొనుక్కొన్నది ఫుట్‌బాల్‌గాడు పడుకోటానికా? దంతసుందరి మద్దెల మోతను వినటానికా?

'నువ్విలా రా, బుజ్జీ, బావగారిని నిద్ర పోనీయ్'. రెండో హీరోయిన్ అప్పుడు రంగంలో దూకి బుజ్జిగాడిని ఆజ్ఞాపించింది.

'పోవే, నువ్వెవతవు నన్ను ఆజ్ఞాపించటానికి?''

'ఏంట్రా? నామాట నెదిరిస్తావ్? నేను నీ అక్కనురా.'

'పో పోవే. నువ్వు అక్కవయితే, నేను మగాడిని. సూపర్‌మేన్ పదిని-హహ్హహ...

ఇద్దరూ అలా కాస్సేపు మాటల్తో, ఆ తరవాత చేతుల్తో కొట్టుకున్నారు. చివరికి ఏమనుకున్నాడో ఏమో ఫుట్‌బాల్‌గాడు కిందికి దిగి తల్లి పక్కనున్న తండ్రిని లేపి ఆయన్ని ఆయన సీటులోకి పంపి, తను తల్లి పక్కన కూర్చున్నాడు. నేను బెర్త్ పైకి ఎక్కాను.

'అక్కా! నువ్వు అమ్మ పక్కకి రావే. నేను నాన్న పక్కన కూర్చుంటాను.'

'ఆశ. నా మొగుడిని రాత్రంతా చూస్తూ కూర్చుందామనా? నాకు తెల్సులే నీ ప్లాను.'

ఏ పెంపకంరా. భగవంతుడా? ముగ్గురికీ ముగ్గురే. అసలా తల్లిదండ్రులు మాత్రం? ఆ ఇంటికి అల్లుడు అయితే పిచ్చెక్కదూ?

అర్ధరాత్రి దాటాక నాకు కాస్త నిద్ర పట్టింది. ఎవరో నా చెయ్యి గీరుతున్నట్లయితే ఉలిక్కి పడి లేచాను.

'నేను, బావా, ఈ ప్రేమలేఖ తీసుకుని చదువుకో''. రెండో హీరోయిన్ ఓ కాగితాన్ని చేతిలో పెట్టింది.

'నువ్వు అక్కను పెళ్ళి చేసుకోకు బావా. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నాకు దక్కని నాడు రైల్లో నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటాను' చాలా డ్రమెటిక్‌గా అని తన స్థానంలో కూర్చుంది.

కంపార్టుమెంట్ స్టాండింగ్ పాసెంజర్స్‌తో కిటకిటలాడిపోతూంది. నిల్చునే చాలా మంది నిద్రపోతున్నారు.

నేను కళ్ళు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించాను.

మళ్ళీ చెయ్యి గీకుడు.

'బావా! చిన్నక్క రౌడీ. దాన్ని చేసుకోకు. పెద్దక్కని చేసుకో.' ఫుట్‌బాల్‌గాడు సలహా ఇచ్చాడు.

'ఆశ్చర్యపోతున్నావు కదూ! నేను నిద్రపోతూ కూడా అన్నీ కనిపెడుతుంటాను బావా. అయామ్

జేమ్స్ బాండ్ 999 హహ్హాహ్హా.'

'నీ పిండాకూడు' అనుకొని మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

అదిగో..... ఆ తరవాత ఇదే లేవటం.

కానీ వీళ్ళ పీడ విరగడ కాలేదేం? దిగాల్సిన స్టేషన్ వచ్చినా వీళ్ళు దిగరేం?

కొంపతీసి నాతో చెప్పి పోవటం కోసం నేను లేచిందాకా కాచుక్కూర్చోటం కాదుకదా?

ఏమయితే అవుతుందని తెగించి నేను లేవటానికే నిర్ణయించుకున్నాను. బాత్‌రూమ్‌కి వెళ్ళాల్సిన అవసరం కూడా ఉంది. రాత్రంతా జనంలో ఈదుకుంటూ పోలేక ఆ అవసరాన్ని పోస్ట్‌పోన్ చేస్తూనే వచ్చాను. ఇక నా వల్ల కాదు.

నేను కళ్ళు విప్పాను.

'అడుగో- బావ లేచాడు. బావా, బావా, మా ఊరొచ్చేసింది. లేలే.'

'మీరిక్కడ దిగుతారా?' ఫుట్‌బాల్ అమ్మగారిని అడుగుతున్నారు నిలబడ్డ పాసెంజర్ ఎవరో

'పిల్లవాడి మాటలకేమండీ? వాడో పిచ్చివాడు. దిగాల్సిన సమయం వస్తే మేం దిగమా?' అంటున్నది ఆమె.

ఇంతకీ పాపం బోండాం మామగారేరీ?

'విజయవాడ స్టేషన్ వచ్చేసింది గదా? మీరింకా దిగరేం?' నేను బెర్త్ దిగి కిందికొచ్చి వారి పక్కన కూర్చుంటూ అడిగాను.

'మీ మామగారు ఏదో పని మీద రైలు దిగి వెళ్ళారు నాయనా. ఆయన వస్తేనే కానీ మేము ఇక్కడ దిగేదీ, లేక నీతోపాటు వచ్చేదీ నిర్ణయం కాదు' అంది ఆమె.

అయ్యో.....హత విధీ!

'అడుగో నాన్న.'

వాళ్ళనాన్న అయిదుగురు వ్యక్తుల్ని వెంట పెట్టుకొని పరుగుల మీద కంపార్టుమెంట్ దగ్గరికొస్తున్నాడు.

మా బండి కదలబోతున్నట్లు అనౌన్స్‌మెంట్ అయింది.

ఆ నలుగురి మొహాల్లో భయాందోళనలు.

గార్డు విజిల్ వేశాడు.

అప్పుడు కిటకిట లాడుతున్న జనాన్ని తోసుకుంటూ అక్కడికొచ్చాడు బోండాం మామ.

'ఇవిగో. ఇవే మీ అయిదు సీట్లు' అంటూ నాతో సహా మిగతా నలుగురు కుటుంబ సభ్యుల జాగాలు చూపించాడు.

'లేవండి. లేవండి. బండి కదిలే టైమ్ అయింది.'

అప్పుడు ఆయన భార్య, ముగ్గురు పిల్లలు లేచారు. వాళ్ళ స్థానాలలో బోండాం మామ వెంట వచ్చిన అయిదుగుర్లో నలుగురు సర్దుకుని కూర్చున్నారు.

'అల్లుడూ! నువ్వూ లేవాలి. ఆ సీటు ఆయనకిచ్చాను. నువ్వు మాసామాను దించటానికి సాయం చెయ్యి' అంటూ భార్య బిడ్డలకి సామానుతో బండి దిగమని ఆజ్ఞ జారీ చేశాడు.

వాళ్ళు తోసుకుంటూ, జనంలోకి చొచ్చుకుంటూ ప్రగతిపథంలోకి పయనించసాగారు.

ఇప్పటిదాకా ఊరుకుని ఇప్పుడు ఇంత హడావిడిగా దిగటమేమిటో నాకర్థం కాలేదు.

'మరి నన్ను పంపించండింక.' అయిదుగుర్ని చూస్తూ అన్నాడు మామ.

వాళ్ళలో ఓ వ్యక్తి వంద రూపాయలనోటు తీసి 'థూ' అంటూ ఆయన వైపు విసిరేశాడు. ఆ నోటు కింద పడబోతుంటే అందుకోబోయాడాయన. కాని అది బల్లకింద ఉమ్మి గలీజులో పడింది. దాన్ని ఆయన భద్రంగా తీసి జేబులో పెట్టుకున్నాడు.

ఎర్రచొక్కాలవారు, నల్లచొక్కాలవారు నా కళ్ళ ముందు కన్పించారు. వారు పర్చుకొన్న పేలికల్ని అవతల పారేసి సీట్లను న్యాయం పేరిట దౌర్జన్యంగా ఆక్రమించిన వ్యక్తి ఇంత మంది నిల్చుని ఉంటే, ఎవరికో అనాయ్యంగా ఆ సీట్లను అమ్మేశాడు. ఛీ.ఛీ.ఛీ. గడ్డి తినే మనుషులు.

'డబ్బు మీద కాస్త గౌరవం ఉంచండీ. అలా విసిరి వేస్తారేం?'' అని నోటును విసిరిన ఆయనతో అని'' వస్తానోయ్ అల్లుడూ. నీ అడ్రస్ తీసుకున్నానుగా? నిన్నింక వదలనులే' అంటూ జనంలోకి దూరాడు.

'బావగారూ......బావగారూ.' కిందికి దిగిన వాళ్ళు కిటికీ దగ్గరకొచ్చి అరుస్తున్నారు. నాకు వాళ్ళ మొహం వైపు చూడ బుద్దేయలేదు.

బండి కదిలింది. వాళ్ళు దూరమయ్యారు. అప్పుడు చూచాను నేను-వాళ్ళు బల్లకింద వదిలేసిన పెట్టెను.

'అల్లుడూ! పెట్టె. బల్లకింద మాబాక్స్.' మామగారు రైలుతో పాటు పరుగెత్తుతున్నాడు. రొప్పుతూ అరుస్తున్నారు.

'సీట్లు బేరం పెడితే పోర్టరో, లేకపోతే అలాటి మనిషో అనుకున్నాను. వాళ్ళు నయం. పశువుల్లా కడుపు కోసం గడ్డి తింటున్నారు. ఆయన మీ మామగారా నాయనా? అలాగయితే నీ ఇష్టం. కానీ ఉత్తుత్తి మామగారయితే మాత్రం పెట్టె ఇవ్వకు. అలాంటి వాళ్ళకి ఇలాంటి శాస్తి కావల్సిందే.' నూరు రూపాయలు విసిరేసిన పెద్ద మనిషి అన్నాడు.

బోండాం మామ పరుగెత్తుతున్నాడు. రైలు వేగం పుంజుకుంది.

రొప్పు.....రొప్పు........ఇక పరుగెత్తలేడు.

నేను పెట్టె తీసి కిటికీలోగుండా ఆయన కందించాను.

'పెట్టె నిచ్చారు. ఆయన మీ మామగారేనా?'

'నేను మనిషిని కనక ఆయనకు పెట్టెనిచ్చాను. ఆయన నాకు మామ కాదు. ఆయన్ని గడ్డి తినే మనిషి అన్నారు మీరు. మనిషి అన్నాక గడ్డి తినే వాడినయినా గౌరవించాల్సిందే. కానీ నే నా వ్యక్తిని అసహ్యించుకుంటున్నాను.

'పశువుల్తో ఆ వ్యక్తిని నేను పోల్చను. ఎందుకంటే, గడ్డి తినటం పశు లక్షణం. అది వాటి సహజ లక్షణం.

'మరి ఆయన్నేమని పిలుద్దామంటారు?'

'పశువుల్ని తినే గడ్డి పరక ఆయన.'

కొందరు నవ్వారు. ఆ తరవాత కాస్సేపు నిశ్శబ్దం.

'మాస్టారూ. నేను రైతును. గడ్డిని మీరావిధంగా అవమానించటాన్ని నేను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా. గడ్డితినే గాడిద అనండి'

అంతా చూస్తున్న ఎవరో అన్నారు.

నాకేం మాట్లాడాలో తోచలేదు.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 16-1-1985
('పశువుల్ని తినే గడ్డి' పేరుతో ప్రచురితం)